## సింగయ్య మృతి, మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదు:

గుంటూరు, జూన్ 23, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా పర్యటనలో వ్యక్తి మృతి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సింగయ్య అనే వ్యక్తి మృతి కేసులో మాజీ సీఎం జగన్ ను నిందితుడిగా చేర్చారు. ఈవిషయాన్ని గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం రాత్రి ఎస్పీ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. జూన్ 18న మాజీ సీఎం వైఎస్ జగన్ పల్నాడు జిల్లా రెంటచింతల పర్యటన సందర్భంగా గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో యాక్సిడెంట్ జరిగింది. నల్లపాడు పిఎస్ పరిధిలోని ఏటుకూరు బైపాస్ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గరకు కాన్వాయ్ చేరుకున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది.


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 24-06-2025 సంపుటి: 07 సంచిక: 47 పేజీలు: 8 వెల: రూ 1-00

# జగన్.. మూడు ముక్కలాటతో ఏపీకి రాజధాని లేకుండా చేశారు: సీఎం చంద్రబాబు



అమరావతి: స్వర్ణాంధ్ర విజన్ 2047ను లక్ష్యంగా పెట్టుకున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించామని చెప్పారు. అన్నీ చేసేశామని చెప్పట్లేదు.. ఊహించినదాని కంటే ఎక్కువ చేశామని అన్నారు. సీఎం పదవి తనకు కొత్తకాదని నాలుగు సార్లు సీఎం అయ్యానని గుర్తుచేశారు. మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నా ఎలాంటి సమస్య రాలేదని చెప్పారు. ఎన్ని ఇబ్బందులున్నా చెప్పిన మాట నిలబెట్టుకుంటామని ఉద్ఘాటించారు. సుపరిపాలన అందించేందుకు అధికారులు కూడా కలిసిరావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకంపోయిందని చెప్పారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రకటనతో ఏపీ అభివృద్ధి కుంటుపడిందని సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం పూర్తయితే ఏపీకి నీటి సమస్య సమసిపోతుందని వెల్లడించారు.వైసీపీ హయాంలో నిధులు మళ్లించి దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నాలుగు సంతకాలు పెట్టానని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని ప్రకటించారు. వైసీపీ హయాంలో రెవెన్యూ రికార్డులను అస్తవ్యస్థం చేశారని ఆరోపించారు. 213 అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతున్నామని ఉద్ఘాటించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,400 కోట్లు సాయం చేశామని చెప్పారు. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాం.. పూర్తి చేస్తామని మాటిచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు కేటాయించారని అన్నారు. విశాఖ రైల్వే జోన్ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. తల్లికి వందనం హామీని పూర్తిగా నిలబెట్టుకున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఇరాన్‌లో అణు స్థావరాలపై దాడి..

## భారత్‌కు పొంచి ఉన్న ముప్పు..



న్యూఢిల్లీ, జూన్ 23: ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌లోని కీలక అణు స్థావరాలు.. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌పై అమెరికా ఆదివారం వైమానిక దాడులు జరిపింది. అయితే ఫోర్డ్ అణుకేంద్రంపై దాడి కారణంగా.. ఆ ప్రభావం భారత్‌తోపాటు పొరుగుదేశం పాకిస్థాన్‌పై ఉంటుందనే చర్చ జరుగుతోంది. అందుకు కారణం.. మధ్య ఆసియా నుంచి వీచే గాలులు.. భారత ఉప ఖండాన్ని ప్రభావితం చేస్తుంది. ఇంకాచెప్పాలంటే.. చెర్నోబిల్ విషాదం లేదా ఫుకుషిమా ప్రమాదం వలే దీని ప్రభావం ఉంటుందని అంటున్నారు.ఇరాన్ అణు కేంద్రాలపై దాడి జరిగితే రేడియోధార్మిక వ్యర్థాలు విడుదలవుతాయి. ఈ వ్యర్థాలు గాలితో కలిసి భారత్‌తో సహా మొత్తం ఆసియా ఖండానికి వ్యాపిస్తాయి. అసలు అయితే భారత్.. జేట్ స్ట్రీమ్, పశ్చిమ గాలుల మార్గంలో ఉంది. ఇందులో వ్యర్థాలు గాలితోపాటు ఇతర దేశాలకు వ్యాపిస్తాయి. ఈ విషపూరిత గాలి 140 కోట్లకు పైగా ప్రజలను నివసించే ప్రాంతాలను ప్రభావితం చేయనుంది.న్యూఢిల్లీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సనా రెహ్మాన్ చెబుతున్న మాటల ప్రకారం.. జెట్ స్ట్రీమ్ అనేది ట్రోపోస్పియర్‌పై పొరల ద్వారా అడ్డంగా ప్రవహించే జియోస్ట్రోఫిక్ గాలి. ఇది సాధారణంగా 20 వేల నుంచి 50 వేల అడుగుల ఎత్తులో పశ్చిమం నుంచి తూర్పు వైపునకు వీస్తుంది. వివిధ ఉష్ణోగ్రతలతో గాలులు కలిసే చోట జెట్ స్ట్రీమ్ అభివృద్ధి చెందుతుంది. అందువల్ల ఉపరితల ఉష్ణోగ్రత సాధారణంగా జెట్ స్ట్రీమ్ ఎక్కడ ఏర్పడుతుందో నిర్ణయిస్తుంది. అంటే జెట్ స్ట్రీమ్ అనేది పశ్చిమ గాలుల్లో ఒక భాగం. ఇవి ఎగువ ట్రోపోస్పియర్‌లో కేంద్రీకృతమై ఉంటాయి. జెట్‌స్ట్రీమ్‌లు, వెస్టర్లీలు.. రెండూ భూమి వాతావరణాన్ని ప్రభావితం చేసే వాతావరణ ప్రవాహాలు. జెట్ స్ట్రీమ్ అనేది ఎగువ ట్రోపోస్పియర్‌లో పశ్చిమం నుంచి తూర్పు వైపునకు ప్రవహించే వేగంగా కదిలే గాలికి సంబంధించిన ఇరుకైన ప్రవాహం. ఇక వెస్టర్లీలు.. ఇవి మధ్య అక్షాంశాలలో పశ్చిమం నుంచి తూర్పునకు వీచే గాలులు. అయితే ఈ జెట్ స్ట్రీమ్‌లు.. తుఫానులు, వాతావరణంలో వేగవంతమైన మార్పులతో సహా వాతావరణ నమూనాలను ప్రభావితం చేస్తాయి. అంటే తీవ్రమైన చలి లేదా తీవ్రమైన వేడి గాలులను కలిగిస్తాయి. అణు దాడి నుంచి రేడియేషన్ వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఈ రేడియేషన్ అనారోగ్యానికి దారి తీస్తుంది. అంతేకాకుండా మరణానికి సైతం దారి తీస్తుంది.భారత్‌కు పశ్చిమాన ఇరాన్ ఉందని డాక్టర్ సనా రెహ్మాన్ వివరిస్తున్నారు. యుద్ధ సమయంలో రేడియోధార్మిక కణాలు లీక్ అయితే.. ఆ పశ్చిమ గాలులు ఈ విష కణాలను ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, భారత్ వైపు వస్తాయి.

# విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తేనే మార్పు సాధ్యం: లోకేష్

బాపట్ల: నాణ్యమైన విద్యా, ఉపాధి కల్పించటమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. బాగా చదువుకున్న వారు రాజకీయాల్లోకి రావాలని కోరారు. విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తేనే మార్పు సాధ్యమని వ్యాఖ్యానించారు. బాపట్ల జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటించారు. ఇంకొల్లు వద్ద డీవీఆర్ సైనిక్ స్కూల్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మీడియాతో మాట్లాడారు.గురువులు దేవుడితో సమానమని.. అందరిని గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంటుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. తల్లులను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. పహల్గామ్‌లో అన్యాయంగా భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ టెర్రరిస్టులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సరైన గుణపాఠం చెప్పారని అన్నారు మంత్రి నారా లోకేష్.సైనికులను జాగ్రత్తగా చూసుకుని వారిని గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మనకు పరీక్షలు పెట్టే దేవుడే.. వాటిని జయించే శక్తిని కూడా ఇస్తారని చెప్పుకొచ్చారు. తెలుగుదేశం 20 సంవత్సరాల పాటు మంగళగిరిలో గెలవలేదని అన్నారు. తాను కూడా మంగళగిరిలో మొదటిసారి పోటీ చేసి ఓడిపోయానని... ఆ తర్వాత ఐదేళ్లు కష్టపడి అత్యధిక మెజార్టీతో గెలిచానని గుర్తుచేశారు. తాను ఓడిపోయినప్పుడు ఎందరో హేళన చేశారని.. కానీ తాను బాధపడలేదు...గెలిచి చూపించానని ఉద్ఘాటించారు. ఎవరూ నిరుత్సాహపడొద్దు.. విజయం సాధించి చూపించాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# అసెంబ్లీ ఉప ఎన్నికలో టీఎంసీ విజయకేతనం



న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో పశ్చిమబెంగాల్ నుంచి అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (ఏఓఆ) మరోసారి సత్తా చాటుకుంది. ఎన్నికలు జరిగిన కలీగంజ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి అలిఫా అహ్మద్ 50,049 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలిచారు. ఆమెకు 1,02,759 ఓట్లు పోలయ్యాయి. ఆమె సమీప ప్రత్యర్థి, బీజేపీ నేత ఆశిష్ ఘోష్‌కు 52,710 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కబిలుద్దీన్ షేక్ 28,348 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.ఉప ఎన్నికల్లో టీఎంసీ 55 శాతం ఓటింగ్ షేర్ పొందగా, బీజేపీ 28 శాతం, కాంగ్రెస్ 15 శాతం ఓటింగ్ షేర్ పొందాయి. కలీగంజ్ సీటు తిరిగి గెలుచుకుంటామని టీఎంసీ మొదట్నించీ ధీమాతో ఉండగా, ఈ నియోజకవర్గంలో 48 శాతం మైనారిటీ ఓట్లు ఉండటంతో బీజేపీ ప్రధానంగా హిందూ ఓట్లపైనే ఫోకస్ చేసి ప్రచారం సాగించింది. ఇటీవల కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానంగా ప్రస్తావించింది. టీఎంసీ బుజ్జగింపు రాజకీయాలపై విమర్శలు గుప్పించింది.కలీగంజ్‌లో టీఎంసీ అభ్యర్థి గెలుపొందడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు టీఎంసీ అభ్యర్థిని గెలిపించారని, వారందరికీ తాను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ విజయాన్ని బెంగాల్‌కు, బెంగాల్ ప్రజలకు అంకితమిస్తు?న్నానని అన్నారు. కలీగంజ్ సిటింగ్ టీఎంసీ ఎమ్మెల్యే నసిరుద్దీన్ అహ్మద్ గత ఫిబ్రవరిలో కన్నుమూయడంతో ఆయను కుమార్తె అలిఫా అహ్మద్‌కు ఉప ఎన్నికల్లో టీఎంసీ టిక్కెట్ ఇచ్చింది. గత గురువారంనాడు ఎన్నికలు జరుగగా, 69.85 శాతం పోలింగ్ జరిగింది.

# జగన్‌కు రాజకీయ లబ్ధి తప్పా.. మనుషుల ప్రాణాలంటే లెక్క లేదా: అనిత



అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత (సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీని చూస్తుంటే రాజకీయాలు దిగజారిపోయాయన్న ఆవేదన కలుగుతోందని అన్నారు. జగన్‌కు మానవత్వం లేదు.. హింసను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. ఏపీ సచివాలయంలో హోంమంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన సందర్భంగా జడ్‌ప్లస్ సెక్యూరిటీ కల్పించామని స్పష్టం చేశారు. పరామర్శకు వెళ్తూ జగన్ రోడ్‌షో చేశారని ధ్వజమెత్తారు. ఉదయం పదిన్నరకు తాడేపల్లి నుంచి బయల్దేరిన జగన్.. సాయంత్రం 4 గంటలకు రెంటపాళ్ల చేరుకున్నారని తెలిపారు. జగన్ కావాలనే బలప్రదర్శన చేసుకుంటూ వెళ్లారని చెప్పుకొచ్చారు. జగన్ వాహనం కింద ఓ వ్యక్తి పడిన ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. దయ, జాలి లేకుండా అతడ్ని ముళ్ల పొదల్లో పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు హోంమంత్రి అనిత.సింగయ్యను సమయానికి ఆస్పత్రికి తరలిస్తే బతికేవారని హోంమంత్రి అనిత అన్నారు. దళితుడు జగన్ కారు టైర్ కింద నలిగిపోయినా పట్టించుకోలేదని మండిపడ్డారు. జగన్‌కు రాజకీయ లబ్ధి తప్పించి మనుషుల ప్రాణాలంటే లెక్క లేదా అని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఇద్దరు చనిపోయినా పర్యటన కొనసాగించారని ఫైర్ అయ్యారు. బెట్టింగ్‌లో అప్పులపాలై చనిపోయిన వ్యక్తికి విగ్రహం పెట్టించారని చెప్పుకొచ్చారు. తన పర్యటనలో ఇద్దరు చనిపోయినా జగన్ రెడ్డి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. జగన్‌కు ఇంకా సీఎం కుర్చీలో కూర్చోవాలనే దురాశ ఉందని చెప్పారు. జగన్ వాహనం కిందపడే సింగయ్య నలిగిపోయినట్లు వీడియో ఉందని అన్నారు. సింగయ్య మృతిని వైసీపీ నేతలు నిస్సిగ్గుగా సమర్థిస్తున్నారని.. చనిపోయింది తమ పార్టీ కార్యకర్తేగా అని కొంతమంది నేతలు అంటున్నారని తెలిపారు. జగన్ రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుడని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో జగన్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. జగన్ కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు హోంమంత్రి అనిత.'నాయకులు అనే వారు ఎంతో బాధ్యతగా ఉండాలి. పరిస్థితులు జగన్ వచ్చాక ఇంతగా దిగజారిపోయాయా అనిపిస్తోంది. హింసను చేస్తూ దాన్ని జగన్ సమర్థించుకుంటున్నారు. పొదిలిలో వైసీపీ అరాచకం చూశాం... ఆ వెంటనే రెంటపల్లె వెళ్తాం అన్నారు. వెంటనే మేము నోటీస్ ఇచ్చాం. ఇంతమందితోనే వెళ్లాలని చెప్పాం. పరామర్శకు వెళ్లే వ్యక్తి రోడ్ షో చేశారు. జగన్ నిర్లక్ష్యం కారణంగా సింగయ్య, రెడ్డి అనే వాళ్లు చనిపోయారు. అప్పటికీ కూడా ఇంకా సమర్థించుకోవడం దారుణం. ఆ వీడియో మార్ఫింగ్ అని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు అంటున్నారు. ఇంత దారుణమా. మంత్రి నారా లోకేష్ పరామర్శకు వెళ్తే ఫొటో కూడా ఇవ్వరు... అది ఆయన రాజకీయ పరిణతి. మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌కి బాధ్యత లేదా. వైసీపీ కార్యకర్త పేరుతో ఒక చేత్తో గొడ్డలి.. మరో చేత్తో వైసీపీ జెండా పట్టుకుంటారు. కార్యకర్త ప్రదర్శించిన ప్లకార్డులు సినిమా డైలాగ్‌లు తప్పేముందని జగన్ సమర్థిస్తారా. సినిమాలో చెప్పిన డైలాగ్‌లు బయట నిజం చేస్తాం అంటే ఎలా. పరామర్శకు వెళ్లే వ్యక్తికి 7గంటల పాటు రోడ్ షో అవసరమా? పరామర్శను బలప్రదర్శనగా మార్చుకుంటారా? జగన్, అతని మనుషులు రాజకీయాలను దిగజారుస్తున్నారు. మానవత్వం లేకుండా హింసను ప్రేరేపిస్తున్న రాజకీయ నాయకులను ఏమనాలో కూడా అర్థం కావట్లేదు. సమాజంలో జగన్ లాంటి మనుషులు ఉండటం అవసరమా అని ప్రతీ ఒక్కరూ ఆలోచన చేయాలి' అని హోంమంత్రి అనిత కోరారు.'జగన్ నంగనాచిలా ఇంట్లో కూర్చుని అసత్య ట్వీట్‌లు పెడితే ప్రజలు నమ్మేస్తారనుకుంటున్నాడా.? కార్యకర్తలు ఉన్మాదుల్లా తన వద్దకు రావాలని జగన్ కోరుకుంటున్నాడు. అందుకనుగుణంగా పోలీసు భద్రతను సైతం లెక్కచేయట్లేదు. సింగయ్య మృతితో నాకేంటి సంబంధం అంటూ జగన్ తన విలువను ఇంకా దిగజార్చుకుంటున్నాడు. ప్రాథమిక సమాచారం ఆధారంగానే ఆ రోజు ఎస్పీ వేరే వాహనం ఢీ కొట్టిందని చెప్పారు. ఆధారాలు దొరికాక అదే ఎస్పీ కేసును ముందుకు తీసుకెళ్లారు. చంద్రబాబు పర్యటనలకు గతంలో ఆంక్షలు పెట్టామా అంటున్న జగన్ ... ఇంటి గేటుకు తాళ్లు కట్టింది మరిచారా? చంద్రబాబుని విమానాశ్రయంలో అడ్డుకోలేదా. లోకేష్ యువగళం పాదయాత్రలో మైకు, స్టూలు కూడా లాక్కుని పారిపోలేదా? జడ్ ప్లస్ భద్రతలో భాగంగా జగన్‌కు ఎలాంటి భద్రత కల్పించాలో కల్పిస్తున్నాం. కందుకూరులో తొక్కిసలాట జరిగి తెలుగుదేశం కార్యకర్తలు చనిపోతే చంద్రబాబు వెంటనే మీటింగ్ రద్దు చేశారు.

# అనుకున్న లక్ష్యాలను సాధించిన ఆపరేషన్ సిందూర్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి కి ప్రతిగా మేలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అన్ని లక్ష్యాలను సాధించిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఉగ్రవాదుల్లో భయం పుట్టించిందని, జాతీయ భద్రతపై భారతదేశానికి ఉన్న కృతనిశ్చయాన్ని బలంగా చాటిచెప్పిందని అన్నారు. రాష్ట్రపతి భవన్ కాంప్లెక్స్‌లో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమాన్ని ఉద్దేశించి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బాధ్యతలు చేపట్టిన రెండో సంవత్సరంలో (ఆగస్టు 2023 - జూలై 2024) చేసిన 51 ప్రసంగాలతో కూడిన 'వింగ్స్ టు అవర్ హోప్స్ -వాల్యూమ్ ఎవ'పుస్తకాన్ని ఈ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరించారు. దీనితో పాటు హిందీ వెర్షన్ ఈ-వెర్షన్‌తో సహా ఈ కార్యక్రమంలో అధికారికంగా విడుదల చేశారు. ఈ వ్యాసాల సంకలనాన్ని రాష్ట్రపతి భవన్ చేపట్టగా, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సారథ్యంలోని పబ్లికేషన్స్ డివిజన్ ప్రచురించింది.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాయకత్వం, విజన్‌ను రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా ప్రశంసిస్తూ, ఈ పుస్తకం కేవలం ప్రసంగాల సంకలనం కాదని, భారత భవిష్యత్తును లిపిబద్ధం చేసే డాక్యుమెంట్ అని అన్నారు. గవర్నెన్స్, ఇన్‌క్ల్యూజివిటీ, జాతీయ ఆకాంక్షలను చాటిచెబుతోందని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధనకు ఒక మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి ఎల్ మురుగన్ పాల్గొన్నారు



# లోకేశ్ నెంబర్ 2

విజయవాడ, జూన్ 23,కూటమి ప్రభుత్వంలో నారా లోకేశ్ నిదానంగా కీలకంగా మారుతున్నారు. లోకేశ్ ను కేవలం మంత్రిపదవిలో చూడటానికి వీలులేదు. క్రమేపీ లోకేశ్ తండ్రి ముఖ్యమంత్రి చంద్రబాబుని దాటేసేందుకు ప్రయత్నాలు ఎప్పుడో ప్రారంభించినా ఇప్పుడిప్పుడే సఫలమవుతున్నట్లు కనిపిస్తున్నాయి. లోకేశ్ 2014 ఎన్నికలకు ముందు వరకూ బ్యాక్ ఎండ్ లో పార్టీలో పనిచేసినా ఎవరికీ పెద్దగా ఆయనపై ఒక అభిప్రాయం లేదు. కానీ 2014 ఎన్నికల్లో మంత్రి అయిన నాటి నుంచి పార్టీపై పట్టు సంపాదించుకున్నారు. నేతలను పక్కన పెట్టారు. కేవలం కార్యకర్తలనే దగ్గరకు తీసుకునే నేతగా నారా లోకేశ్ పేరు సంపాదించుకున్నారు. నారా లోకేశ్ కార్యకర్తల



సంక్షేమాన్నిపట్టించుకోవడంలో చంద్రబాబు కంటే ముందున్నారన్న మాట ప్రతినోటా పార్టీలో వినపడుతుంది.. అర్హత ఉన్నోళ్లు టెన్షన్ పడక్కర్లేదు. కార్యకర్తల సంక్షేమం కోసం నారా లోకేశ్ తీసుకు వచ్చిన బీమా పథకాలు కానీ,కార్యకర్తలకు అన్యాయం జరిగితే వెంటనే స్పందించే తీరు కానీ, కార్యకర్తల వెన్నంటే ఉంటాననే బలమైన సంకేతాలు పంపడం వల్ల కానీ ఇప్పుడు పసుపు పార్టీ కార్యకర్తల నరనరాల్లో నారా లోకేశ్ నామస్మరణ మాత్రమే వినపడుతుంది. చెప్పాలంటే క్యాడర్ విషయానికి వచ్చేసరికి చంద్రబాబు లోకేశ్ కంటే కొంత వెనకబడి ఉన్నారనే అనుకోవాలి. లోకేశ్ మాట పార్టీలో చెల్లుబాటు అవుతుందన్న అభిప్రాయం మరింత బలపడటంతో ఇప్పుడు లీడర్లు కూడా లోకేశ్ చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారు. ఇది పార్టీ పరంగా మాత్రమే. ఇక చంద్రబాబు కున్న రాజకీయ అనుభవం రాకపోయినా ఆయన వెంట నడుస్తూ వ్యూహాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.ప్రభుత్వంలో నెంబర్ 2 ఎవరంటే ఎవరైనా ఠక్కున నారా లోకేశ్ పేరు మాత్రమే చెబుతారు. పవన్ కల్యాణ్ నెంబర్ 3 అనాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నారాలోకేశ్ పవన్ కల్యాణ్ కు సంబంధించిన శాఖల్లో వేలు పెట్టరు.కానీ, మిగిలిన అన్ని శాఖల విషయంలో మాత్రం లోకేశ్ ముద్ర ఉండేలా చూసుకుంటున్నారు. పాలనలో తన పట్టు నిరూపించుకోవడం కోసం లోకేశ్ టీం మన మిత్ర యాప్ ను తేవడమే కాకుండా ప్రజలకు ప్రభుత్వాన్నిచేరువ చేసేందుకు ప్రయత్నిస్తుంది. దాదాపు 150 రకాల సేవలు మన మిత్ర ద్వారా కేవలం వాట్సప్ ద్వారా పరిష్కరించడంలో లోకేశ్ టీం సక్సెస్ అయింది. ఇక తల్లికి వందనం నిధులు విడుదల చేయించి తన శాఖలోనూ తనకు తిరుగులేదని లోకేశ్ నిరూపించుకున్నారు. ఢిల్లీ లో పర్యటిస్తూ... చంద్రబాబు కూడా నారా లోకేశ్ కు మరింతగా పొలిటికల్ గ్రిప్ సంపాదించుకునేందుకు తరచూ ఢిల్లీ పర్యటనలకు పంపుతున్నారు.గతంలో చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై తరచూ ఢిల్లీ వెళ్లేవారు. కానీ ఈ మధ్య కాలంలో నారా లోకేశ్ తరచూ ఢిల్లీ వెళుతుండటం కూడా తన తర్వాత లోకేశ్ అని ఢిల్లీ పెద్దలకు కూడా చెప్పే ప్రయత్నం చేస్తున్నట్లే కనిపిస్తుంది. ఢిల్లీకి వెళ్లిన నారా లోకేశ్ రెండు రోజుల పర్యటించి వివిధ కేంద్ర మంత్రులను కలసి రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులపై చర్చించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కూడా కలిసి వచ్చారు. దీనికితోడు కాగ్నిజెంట్ ప్రతినిధులతో సమావేశమై విశాఖలో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పించగలిగారు. ప్రధాని నరేంద్ర మోదీ సయితం ప్రస్తుతం చంద్రబాబు, పవన్ పేర్లతో పాటు లోకేశ్ పేరు కూడా చెప్పడం, విమానాశ్రయంలో లోకేశ్ ను దగ్గరకు తీసుకోవడం చూస్తుంటే లోకేశ్ కు అధికార ముద్ర కూడా పడిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి

# ప్రాణాలు తీస్తున్న అభిమానం



గుంటూరు, జూన్ 23,జగన్ సత్తెనపల్లి పర్యటనలో అపశృతి జరిగిన సంగతి తెలిసిందే. జగన్ కాన్వాయ్ లోని ఓ వాహనం ఢీకొట్టడంతో చెంగయ్య అనే వృద్ధుడు మృతి చెందాడని అంతా భావించారు. అయితే అటువంటిదేమీ లేదని..గుర్తుతెలియని వాహనం ఢీకొని చెంగయ్య మృతి చెందాడని గుంటూరు ఎస్పీ ప్రకటించారు. రాజకీయ నేతల పట్ల కొందరు విపరీతంగా అభిమానం పెంచుకుంటారు. వారికోసం పరితపిస్తుంటారు. వారిని చూడగానే పూనకాలు వచ్చినట్లు ప్రవర్తిస్తుంటారు. వారి ప్రాపకం కోసం పిచ్చిగా వ్యవహరిస్తుంటారు. ఈ క్రమంలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. అలానే ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు చెంగయ్య అనే వైసీపీ కార్యకర్త. మొన్నటికి మొన్న జగన్ సత్తెనపల్లి పర్యటనలో అపశృతి జరిగిన సంగతి తెలిసిందే. జగన్ కాన్వాయ్ లోని ఓ వాహనం ఢీకొట్టడంతో చెంగయ్య అనే వృద్ధుడు మృతి చెందాడని అంతా భావించారు. అయితే అటువంటిదేమీ లేదనిఎగుర్తుతెలియని వాహనం ఢీకొని చెంగయ్య మృతి చెందాడని గుంటూరు ఎస్పీ ప్రకటించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. అయితే తాజాగా ఓ వీడియో బయటకు వచ్చింది. నేరుగా జగన్మోహన్ రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం చక్రాల కింద ఓ మనిషి నలిగిపోయినట్లు కనిపించింది. దీంతో అది చెంగయ్య అని తెగ ప్రచారం నడుస్తోంది.ఏడాది కిందట చనిపోయిన ఓ కార్యకర్త విగ్రహ ఆవిష్కరణకు సత్తెనపల్లి వెళ్లారు జగన్మోహన్ రెడ్డి.అయితే జగన్ పర్యటనల్లో శాంతిభద్రతలు విఘాతం కలుగుతున్నాయని భావించి పోలీసులు కొన్ని రకాల ఆంక్షలు విధించారు. పరిమిత వాహనాలతో పాటు 100 మందితో విగ్రహ ఆవిష్కరణ చేసుకోవాలని సూచించారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా జన సమీకరణ చేశాయి. దాదాపు 6 గంటల పాటు ఆలస్యంగా ప్రారంభమైన జగన్ పర్యటన రెండు కిలోమీటర్ల మేర సాగడానికి.. దాదాపు 6 గంటలకు పైగా పట్టింది.అయితే అదే రోజు గుంటూరు జిల్లా పరిధిలో చంగయ్య అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జగన్ కాన్వాయ్ లోని వాహనం ఢీ కొట్టి ఆయన మృతి చెందాడని రోజంతా ప్రచారం నడిచింది. అయితే ఆరోజుఎసాయంత్రానికి గుంటూరు ఎస్పీ దీనిపై క్లారిటీ ఇచ్చారు. చెంగయ్య గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి చనిపోయారని ఎఫ్ఐఆర్ లో నమోదు చేశారు. దీంతో ఈ వివాదం అంతటితో సద్దుమణిగింది అని అంతా భావించారు.కానీ సమీప ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులకు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.ప్రధాన రహదారి క్రాసింగ్ వద్ద జగన్ కాన్వాయ్ వెళ్తోంది. భారీగా జనాలు గుమిగూడారు. ఈ క్రమంలో ఓవృద్ధుడు జగన్ ప్రయాణిస్తున్న వాహనం చక్రాల కింద పడిపోయాడు. పక్కనే ఉన్న వైసీపీ కార్యకర్తలు కేకలు వేసిన ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తీవ్ర గాయాల పాలైన వృద్ధ దును పక్కకు లాగి సఫర్యలు చేశారు.ఇంతలో పోలీసులు వచ్చి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. అయితే ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు సమీప ప్రాంతాల్లో సిసి ఫుటేజీలను పరిశీలించారు. అయితే జగన్ ప్రయాణించే వాహనం కిందపడి నలిగిపోయిన వ్యక్తి చెంగయ్య అని తేలింది. మరోవైపు ఆ సమయంలో అక్కడ ఉన్న వైసీపీ కార్యకర్తలను పోలీసులు విచారించారు. అసలు ఆ రోజు ఏం జరిగింది అనే దానిపై ఆరా తీశారు. అయితే వృద్ధుడు చంగయ్య జగన్ ప్రయాణించే వాహనం కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడని.. కేకలు వేసినా వాహనం ఆపలేదని సదరు వైసీపీ కార్యకర్తలు పోలీసు విచారణలోతెలిపినట్లు సమాచారం. మొత్తానికైతే జగన్ వాహనం కిందపడి చెంగయ్య మృతి చెందడం రాజకీయ దుమారానికి దారి తీసే అవకాశం ఉంది. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలా సమర్థించుకుంటుందో చూడాలి. అయితే అభిమానం అనే మాట మూల్యం చెల్లించుకోవడం అంటే చెంగయ్యను గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది.

## అగ్నికి ఆహుతి అయిన ట్యాంకర్

తిరుపతి,తిరుపతి జిల్లా గూడూరు రూరల్ ప్రాంతం లో గూడూరు వెంకటగిరి రోడ్డు రహదారి పై తుంగపాలెం చెమిర్తి రోడ్డు వద్ద ఓ ట్యాంకర్ అగ్నికి ఆహుతైనది. .

ఈ ప్రమాదం లో ట్యాంకర్ ఇంజిన్ బాగం పూర్తిగా కాలిపోయింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జగన్ ధైర్యం వెనుక అదేనా....



గుంటూరు, జూన్ 23, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచనలో పడిందా? ఆయనపై చర్యలు తీసుకోకపోవడానికి కారణాలు ఏమై ఉంటాయన్నది ఇప్పుడు కూటమి పార్టీలో పెద్దయెత్తున చర్చజరుగుతుంది.కొన్నేళ్లుగా జగన్ పై ఉన్న కేసులన్నీ పెండింగ్ లోనే ఉన్నాయని, కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదని కూటమి పార్టీలో ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడుతున్నారు. మోదీ తనకు అనుకూలంగా ఉంటారన్న ధైర్యంతోనే జగన్ ఉన్నారని టీడీపీ నేతలు కూడా భావిస్తున్నారు. అందుకు ఆంధ్రప్రదేశ్ లో లిక్కర్ స్కామ్ పై ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు నిందితులను విచారించి చాలా రోజులయినప్పటికీ ఇప్పటికీ ముందడగు పోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. జగన్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లోనూ పురోగతి లేదు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న సీబీఐ అధికారులు కూడా దీనిపై పెద్దగా స్పందించడం లేదు. ఇక 2019లో జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ పురోగతి లేదు. అసలు నిందితులని అనుమానిస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. ఈ ఇప్పటికే ఈ కేసు సీబీఐ విచారణ ప్రారంభించి ఇన్నేళ్లవుతున్నా అంగుళం కదలకపోవడానికి కారణాలపై ముఖ్యంగా టీడీపీ నేతల్లోనే చర్చ మొదలయింది. జగన్ బెంగళూరులో ఉంటున్నప్పటికీ, ఢిల్లీ గడప తొక్కపోయినప్పటికీ అక్కడి వారితో సంబంధాలు బాగానే నెరుపుతున్నారన్న అనుమానాన్ని టీడీపీ సీనియర్ నేత ఒకరు వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ కూడా వైసీపీ ఎంపీల జోలికి పోవడం లేదు. ఇద్దరిని మాత్రమే రాజీనామా చేయించగలిగింది. కనీసం జగన్ పై వత్తిడి చేసే ప్రయత్నం చేయలేదు. నాడు టీడీపీలో ఉన్న రాజ్యసభ సభ్యులందరూ నలుగురు వెళ్లి బీజేపీలో కలిశారని, నేడు ఏడాది అవుతున్నా కేవలం ఇద్దరు మాత్రమే రాజీనామా చేశారని, వారిలో ఒకరు తిరిగి బీజేపీలో చేరగా, మరొకరి స్థానంలో బీజేపీ అభ్యర్థినే పోటీకి నిలబెట్టి గెలిపించుకున్నారంటున్నారు. జగన్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుల్లో ఆర్థికంగా బలవంతులున్నప్పటికీ వారి జోలికి వెళ్లకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యసభలో జగన్ ను జీరో చేయాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీయే సహకరించడం లేదన్న భావన తెలుగు తమ్ముళ్లలో వ్యక్తమవుతుంది. . అందుకే జగన్ ధైర్యంగా రాష్ట్రంలో తిరిగగలుగుతున్నారని, ఢిల్లీలో ఉన్న పెద్దలకు జగన్ పట్ల ఉన్న సాఫ్ట్ కార్నర్ ఇలాంటి పరిస్థితిని తెచ్చిపెట్టిందన్న అభిప్రాయం పసుపు పార్టీలో పుష్కలంగా కనిపిస్తుంది. తమ చేతికి మట్టి అంటకుండా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ లు చేయించాలని భావించిన తెలుగుదేశం పార్టీ నేతల ఆశలు నిజం కాకపోవడంతో రాను రాను ఇక జగన్ కు క్రేజ్ పెరిగే అవకాశముండటంతో అప్పుడు బీజేపీ ప్రభుత్వం కూడా సహకరించే అవకాశం ఉండకపోవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ విచారణలు వంటివి తాబేటి నడకలా సాగుతుండటంతో ఈ అనుమనాలు సహజంగానే కలుగుతున్నాయి. మరి నిజమేంటో కానీ.. జగన్ ఏ ధైర్యంతో ఉన్నారన్నది ఆయనకే తెలియాలి.

# ఇంధన-శాఖలో దళారీల రాజ్యం

విజయవాడ, జూన్ 23, ఏపీ ఇంధన శాఖలో తాత్కాలిక ఉద్యోగుల పెత్తనం సాగుతోంది. లక్షల కోట్ల ఖరీదైన ప్రాజెక్టుల బాధ్యతల్ని అనుభవం లేని వారికి, కన్సల్టెంట్లకు అప్పచెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటనే చర్చ జరుగుతోంది. ఓఉన్నతాధికారి కనుసన్నల్లో జరుగుతున్న నియామకాలు, విధుల కేటాయింపులో మతలబు ఏమిటనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది.ఇంధన రంగంలో పురోగతి సాధించేందుకు ప్రైవేట్ భాగస్వామ్యంతో లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు వివిధ దశల్లో సాగుతున్నాయి.ఏపీ జెన్‌కో పరిధిలోని సాంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ ద్వారా ప్రైవేట్ పెట్టుబడులతో ఈ ప్రాజెక్టుల్ని చేపడుతున్నారు. ప్రస్తుతం ఇంధన శాఖలో కీలక నిర్ణయాలన్నీ ఓ అధికారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. వీటిపై ఐఏఎస్‌ల పర్యవేక్షణ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొన్నేళ్లుగా ఏపీలో సోలార్, గ్రీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజీ వంటి పద్ధతుల్లో విద్యుతుత్పత్తి కోసం భారీ పెట్టుబడులతో ప్రాజెక్టుల్ని చేపట్టారు. భవిష్యత్‌లో ఏర్పడే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి సాధించడంతో పాటు గ్రిడ్ అవసరాలను తీర్చేలా భారీ ఎత్తున ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంటోంది. దాదాపు రూ.3లక్షల కోట్ల ఖరీదు చేసే ప్రాజెక్టుల్ని ఏపీ ఇంధన శాఖ ఆధ్వర్యంలో వివిధ దశల్లో ఉన్నాయి.ప్రస్తుతం ఏపీలో నిర్మిస్తున్న నూతన ఇంధన వనరుల ప్రాజెక్టుల్లో విండ్ పవర్, సోలార్ పవర్, స్మాల్ హైడ్రో, బయో మాస్ బేస్డ్ ప్రాజెక్టులు, బయో ఎనర్జీ కో జనరేషన్, మునిసిపల్ సాలిడ్ వేస్ట్,ఇండస్ట్రీయల్ వేస్ట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. 2024-25 నాటికి ఈ ప్రాజెక్టుల ద్వారా 9982.489 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేది. 2025-26లో ఇప్పటి వరకు మరో 36మెగావాట్ల ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 10వేల మెగావాట్ల విద్యుత్‌ను ఈ శాఖ చేరుకుంది.మరోవైపు రాష్ట్రంలో దాదాపు రూ.3లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టుల్ని నెడ్‌కాప్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టింది. వీటి నిర్వహణ, ప్రాజెక్టుల పర్యవేక్షణ, విద్యుత్ కొనుగోళ్లు వంటి అంశాలపై ఐఏ??ఎస్ అధికారుల పర్యవేక్షణ తప్పించడం ఎందుకనే చర్చ జరుగుతోంది.ఆంధ్ర ప్రదేశ్ ఇంధన రంగంలో పురోగతిని సాధించేందుకు కొత్త తరహా ప్రాజెక్టులకు కొన్నేళ్లుగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. సాధారణంగా ప్రభుత్వ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసే సంస్థలను ఐఏ?ఎస్ అధికారులనూ, అయా శాఖల్లో నిష్ణాతులైన వారికి బాధ్యతలు అప్పగిస్తుంటారు.ప్రస్తుతం ఎన్ ఆర్ ఈడీ క్యాప్ వీసీ, ఎండీగా ఉన్న కమలాకర్ బాబు గతంలో సోలార్ పవర్ కార్పొరేషన్ కు ఎండీగా ఉండేవారు. అప్పట్లోఎన్ ఆర్ ఈడీ క్యాప్ ఎండీగా ఐఏఎస్ అధికారి చక్రధర బాబు ఉండేవారు. నెడ్‌కాప్ ఎండీకి మరో అధికారికి పొసగక పోవడంతో ఆయనను కేవలం జెన్కోకు మాత్రమే పరిమితం చేశారనే ప్రచారం ఇంధన శాఖలో ఉంది.ఆ తర్వాత అనూహ్యంగా నెడ్‌కాప్ విసీఎండీ బాధ్యతలు కమలాకర్ బాబుకు అప్పగించారు. ఆయనకు ఇంధన శాఖతో ఎలాంటి సంబంధం, అనుభవం లేకున్నా కీలక బాధ్యతలు అప్పగించేశారు. ఐఏఎస్ అధికారులు నిర్వహించాల్సిన కీలక బాధ్యతల్ని వైద్య శాఖలో రిటైర్ అయిన ఒక గ్రూపు 4 అధికారికి అప్పగించడం వెనుక ఏమి జరిగిందనేది అంతుచిక్కని వ్యవహారంగా మారిందిఏపీలో కీలకమైన నూతన ఇంధన వనరుల శాఖకు విద్యుత్ రంగంలో అనుభవం, అర్హతలు ఉన్న అధికారుల్ని నియమించక పోవడం వెనుక గుట్టు ఏమిటనే చర్చ ఆ శాఖలో జరుగుతోంది. వైద్య శాఖకు చెందిన రిటైర్డ్ అధికారిని ఎన్ ఆర్ ఈడీ క్యాప్ వీసీగా నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న విజయానంద్, ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా కొనసాగుతున్నారు. ఇంధన శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసిన అనుభవం ఉండటంతో ఇంధన శాఖ బాధ్యతలు కూడా సీఎస్ చేతిలోనే ఉన్నాయి.మరోవైపు నూతన, పునరుద్ధరణీయ ఇంధన శాఖకు తగినంత మంది శాశ్వత ఉద్యోగులు లేక పోవడంతో ఇతర శాఖల ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. లక్షల కోట్ల రుపాయల ప్రాజెక్టులు సాగుతున్న ఈ శాఖలో దానికి సంబంధం లేని వ్యక్తిని వీసీ-ఎండీగా నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తమైన సమయంలో పదవీ విరమణ చేసిన మరో అధికారిని జీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఇంధన రంగానికి సంబంధం లేని వ్యక్తిని నెడ్‌కాప్ వీసీ- ఎండీగా నియమించడం, జీఎం స్థాయిలో మరో అధికారిని నియమించడం వెనుక ఇంధన శాఖ పెద్దల వ్యూహం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.ఉద్యోగుల నియామక ఉత్తర్వుల్లో ఆ శాఖకు చెందిన ఫైల్స్ మొత్తం ఎవరి ద్వారా ఎక్కడికి వెళ్లాలో కూడా ఉత్తర్వుల్లో నిర్దేశించడంలోనే అసలు మతలబు ఉన్నట్టు చెబుతున్నారు.ప్రస్తుతం లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు నిర్వహిస్తున్న నూతన, పునరుద్దరణీయ ఇంధన వనరుల శాఖ బాధ్యతల్ని ఐఏఎస్‌లకు కాకుండా బయటి వ్యక్తులకు అప్పగించడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.ఏపీ విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ ఉన్నా ఆయనకు సంబంధం లేకుండానే ఆ శాఖకు సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ అమలు జరుగుతున్నాయనే ప్రచారం ఉంది. ప్రభుత్వంలో అన్ని శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలపై రిమోట్ మరో చోట ఉండటంతో విద్యుత్ శాఖ మంత్రి కూడా ముఖ్యమైన నియామకాలను, నిర్ణయాలను పట్టించుకోవడం మానేసినట్టు తెలుస్తోంది. కొన్నేళ్లుగా ఇంధన శాఖను శాసిస్తోన్న వ్యక్తి కనుసన్నల్లోనే అన్ని నియామకాలు జరుగుతుండటంపై మంత్రి కూడా కినుక వహించినట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను అర్హత లేని వ్యక్తులకు కట్టబెట్టడం వెనుక ఇతర ఉద్దేశాలు ఉన్నాయనిఇంధన శాఖలో ప్రచారం జరుగుతోంది.పెట్టుబడులు, ప్రాజెక్టులు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు వెలుగు చూడకుండా అస్మదీయులకు కీలక బాధ్యతలు అప్పగించారని ఈ పరిణామాలతో విసుగు చెందిన మంత్రి కూడా వాటికి దూరంగా ఉంటున్నట్టు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది

# పవన్ గ్రాఫ్ పెరిగిందా...తగ్గిందా

ఏలూరు, జూన్ 23, సినిమాల్లో పవన్ కల్యాణ్ కు తిరుగులేదు. చేసింది తక్కువ సినిమాలయినా చిరంజీవికి మించిన క్రేజ్ వచ్చింది. నిజానికి మెగా స్టార్ చిరంజీవి తమ్ముడిగానే టాలీవుడ్ లోకి కాలుమోపినా తర్వాత పవన్ కల్యాణ్ తనకంటూ లక్షల సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్నారు. టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిఇన్ని దశాబ్దాలు గడిచినా ఇమేజ్ ఇసుమంత కూడా చెక్కు చెదరలేదు. పవన్ కల్యాణ్ మూవీ వస్తుందంటే ఫ్యాన్స్ కు పండగే. నిజానికి అభిమానులు దేవుడిగా పవన్ కల్యాణ్ ను కీర్తిస్తుంటారు. చేతులెత్తి మొక్కుతుంటారు. కాళ్ల మీద పడితే చాలు జన్మధన్యమయిపోతుందనుకునే వారు లక్షల్లోనే ఉంటారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చినా పవన్ కల్యాణ్ చరిష్మా సినిమాల్లో చెక్కు చెదరలేదు కానీ రాజీకీయాల్లో మాత్రం అది రివర్స్ లో ఉంది. అధికారంలోకి రాకముందు పవన్ కల్యాణ్ కు పొలిటికల్ కూడా అనేక మంది అభిమానులుండే వారు. జనం కోసం పనిచేసే నేతగా ఆయన మాటల్లోనూ, చేతల్లోనూ కనిపించడంతో ఆయనను ఒక్కసారి ముఖ్యమంత్రి చేసుకుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కూడా భావించారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయినప్పటికీ రాజకీయాలను వదలిపెట్టకుండా, ఒక్కసీటు రాకపోయినా, తాను కూడా పోటీ చేసిన రెండు స్థానాల్లో ఓటమి పాలయినా రెండో రోజునే తేరుకుని బయటకు వచ్చిన పవన్ కల్యాణ్ వైఖరిని చూసి పక్కన ఉన్న వారే ఆశ్చర్యపోయారు. సాధారణంగా అలాంటి వైఖరి ఎంత సీనియర్ రాజకీయ నేతల్లోనూ కనిపించదుజఅందుకే సినిమాల్లోగానే రాజకీయాల్లోనూ పవన్ కల్యాణ్ కు ప్రాణమిచ్చే అభిమానులు తయారయ్యారు. సామాజికవర్గం పరంగా కావచ్చు. వివిధ పార్టీలకు చెందిన న్యూట్రల్ ఓటర్లు కావచ్చు. పవన్ కు పొలిటికల్ ఫ్యాన్స్ గా మారిపోయారు. అయితే 2024 ఎన్నికల తర్వాత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు కూడా పెద్దగా ఆయన ఇమేజ్ ఇంచు కూడా చెక్కు చెదరలేదు. కానీ ఏడాది కాలం తర్వాత మాత్రం ఆయన ఇమేజ్ కు బీటలు వారుతున్నట్లే కనిపిస్తుంది. ఎందుకంటే ప్రజాసమస్యలపై పట్టించుకోకపోవడం, రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై స్పందించకపోవడంతో పాటు ప్రతిపక్ష నేతపై ఎప్పటిలాగానే విరుచుకుపడుతుండటం చాలా మందికి నచ్చడం లేదు. .



పవన్ కల్యాణ్ వ్యవహారశైలి పొలిటికల్ గా భిన్నంగా మారడం చూసి ఆయనకు ఓటేసిన వారే ఆశ్చర్యపోతున్నారు. ప్రశ్నిస్తానని వచ్చిన పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడకా ప్రజలా సమస్యలపై ప్రశ్నించకుండా, ఇంకా ప్రతిపక్ష నేతను, అదీ పదకొండు సీట్లకే పరిమితమైన జగన్ ను ప్రశ్నిస్తే ఏమొస్తుందన్న భావన అందరిలోనూ కలుగుతుంది. పవన్ కల్యాణ్ అధికారం రుచులు చూసిన తర్వాత తన వైఖరిని తానే మార్చుకున్నట్లుందన్న కామెంట్స్ సోషల్ మీడియా వేదికగా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో ఉంటూ ప్రశ్నించడం కష్టమేకావచ్చు. కానీ అన్ని విషయాల్లోనూ తలూపితే ప్రభుత్వం తీసుకునే కొన్ని ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు కూడా పవన్ కల్యాణ్ రానున్నఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఏ విషయమైనా సూటిగా మాట్లాడి తనపై పడుతున్న అపవాదును తానే చెరిపేసుకోవాలని కోరుకుంటున్నారు.

## ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

### జాయింట్ కలెక్టర్ నవ్య






కలెక్టరేట్ కర్నూలు: పిజిఆర్ఎస్ లో వచ్చిన ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు..సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాల పై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని బియాండ్ ఎస్ ఎల్ ఏ వెళ్లకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికపుడు చూడాలని ఎట్ టూ వ్యూ లో ఏ ఒక్క అర్జీ కూడా ఉండకూడదన్నారు సిఎంఓ గ్రీవెన్స్ కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 7, కర్నూలు ఆర్డీఓ వద్ద 4, పత్తికొండ ఆర్డీఓ వద్ద 3, కలెక్టరేట్ ఏఓ వద్ద 3, సర్వే ఏడి , విద్య శాఖ, పశుసంవర్ధక శాఖ , డిఆర్డిఏ పిడి ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 29 అర్జీలు

కర్నూలుప్రజా ఫిర్యాదులు దృష్టికి రాగానే వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 29 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఆర్ఓ జునైద్, ఎంఈ లీల ప్రసాద్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.వచ్చిన విన్నపాల్లో కొన్ని..1. వడ్డేగిరి కెవిఆర్ గార్డెన్ ప్రాంతాల్లో తమకు తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు అబ్దుల్ సలాం, మహ్మద్ అహమ్మద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇదే సమస్యను బొంగుల బజార్ నందు ఉందని ఎం.ధరణి, జి.నాగమ్మ, సరస్వతి, పద్మ ఫిర్యాదు చేశారు.2. జొహరపురం ఇందిరమ్మ కాలనీ నందు డ్రైనేజీ కాలువ, వీధి దీపాలు వెలగడం లేదని స్థానికురాలు నజియ ఫిర్యాదు చేశారు.3. శ్రీ సిద్ధివినాయక నగర్ నందు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని స్థానికులు నసీర్ బాష, సుమ, లీల తదితరులు విన్నవించారు.4. జొహరపురం హౌసింగ్ బోర్డు కాలనీ నందు పార్కు, వీధి దీపాల మరమ్మతులు చేపట్టాలని, పూడికతీత పనులను చేపట్టాలని స్థానికులు రంగస్వామి, ఈశ్వరయ్య, రాజేష్, తదితరులు విన్నవించారు.5. జీవో నెంబర్ 5 ను సవరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు.




## నోయిడా పట్టణం మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్ సెక్టర్ 18 లో 400వ షోరూం ప్రారంభం

కడపనోయిడా పట్టణం, సెక్టార్ 18లో 400వ షోరూమును మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్.మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహమ్మద్ ఘనంగా ప్రారంభించారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్ షోరూమ్ల సంఖ్య 400, వి9 బిలియన్లకు ( ఐఎన్ఆర్ 78,000 కోట్లు) టర్నోవర్నుపెంచడమే లక్ష్యంగా ప్రణాళికలు,భారతదేశంలోని నోయిడాలో కొత్త షోరూముని ప్రారంభించడం ఒక మైలురాయిగా నిలిచిపోయింది.భారతదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా 15 దేశాల్లో తమ ఉనికిని విస్తరించడానికి దూకుడుగావృద్ధి ప్రణాళికను రూపొందించిన మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్.నేషనల్, 18 జూన్ 2025: ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ ఆభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్గోల్డ్ ఢ డైమండ్స్, తమ 400వ షోరూం ప్రారంభోత్సవంతో, అంతర్జాతీయ స్థాయిలో ఒక గొప్ప మైలురాయినిచేరుకుంది, ఈ సందర్భాన్ని సగర్వంగా వేడుక చేసుకుంది. నోయిడాలోని సెక్టార్ 18లో కొత్త షోరూమ్ప్రారంభంతో, తమ విస్తరణ కార్యక్రమాల్లో ఒక మైలురాయిగా గుర్తించబడింది, ఇది ప్రపంచవ్యాప్తంగామలబార్ బ్రాండ్ యొక్క వేగవంతమైన విస్తరణను బలోపేతం చేస్తుంది.మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్ గురించిభారతదేశంలో వైవిధ్యభరితమైన వ్యాపార సమ్మేళన సంస్థ అయిన మలబార్ గ్రూప్ యొక్క ప్రధాన వ్యాపారసంస్థ మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్ 1993లో స్థాపించబడింది. 7.36 బిలియన్ డాలర్ల వార్షిక టర్నోవర్,ప్రస్తుతం మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్ ప్రపంచ వ్యాప్తంగా 5వ అతి పెద్ద ఆభరణాల రిటైలర్గాప్రఖ్యాతిగాంచింది. నేడు భారతదేశం, మిడిల్ ఈస్ట్, ఫార్ ఈస్ట్, యూఎస్ఏ, యూకే, కెనడా,ఆ స్ట్రేలియా వంటి దేశాల్లో కార్యాలయాలు, డిజైన్ కేంద్రాలు, హె?లే సేల్ యూనిట్లు, కర్మాగారాలతోపాటు, 13 దేశాలలో 400 అవుట్లెట్లతో బలమైన రిటైల్ నెట్వర్క్? కలిగి ఉంది. 4,000 కంటే ఎక్కువ మంది వాటాదారుల యాజమాన్యంతో కొనసాగుతున్న మలబార్ గ్రూపులో, 26 కంటే ఎక్కువ దేశాల నుండి 25,000మంది కంటే ఎక్కువ నిపుణులు పని చేస్తూ, మలబార్ నిరంతర విజయం కోసం కృషిచేస్తున్నారు. ఎప్పుడైనా, ఎక్కడి నుండి అయినా వినియోగదారులు తమకు ఇష్టమైన ఆభరణాలనుసౌకర్యవంతంగా కొనుగోలు చేయడానికి లిలిలి.ఎజీశ్రీజీఎజీతీణనీశ్రీటజీనిటటతిజీఎనీనిటబ.ఇనీఎ వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్షాపింగ్ చేసే అవకాశాన్ని కల్పించింది మలబార్ గోల్డ్ ఢ డైమండ్స్.మలబార్ గ్రూపు ప్రారంభం నుండి పర్యావరణ, సామాజిక ఢ పాలన (ఈఎస్ జి) ప్రాథమిక నిబద్ధతగాకొనసాగుతుంది. మలబార్ గ్రూప్ యొక్క కీలక ఈఎస్జి అంశాలైన ఆరోగ్యం, గృహనిర్మాణం, ఆకలి లేనిప్రపంచం, విద్య, పర్యావరణం, మహిళా సాధికారత పట్ల దృష్టి సారిస్తోంది. బాధ్యత స్థిరత్వం యొక్క సూత్రాలను తమ ప్రధాన వ్యాపారంలో అనుసంధానిస్తూ, మలబార్ గ్రూప్ సామాజిక స్పృహ కలిగిన సంస్థ బాధ్యతాయుతమైన సంస్థగా కొనసాగడానికితమ తమ ఈఎస్జి లక్షణాలను ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తుంది. మలబార్ గ్రూప్ లాభాలలో 5శాతాని ఆయా దేశాలలో సేవా కార్యక్రమాలకు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా ఆపరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఓ ఆషర్, గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెపి వీరన కుట్టి, గ్రూప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సలీష్ మాధ్యు, రిటైల్ ఆపరేషన్ పీకే సిరాజ్, రీజినల్ హెడ్ ఎన్ కే జిషాద్, మేనేజ్మెంట్ బృందంలోని ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం ...

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 88 ఫిర్యాదులు.

కర్నూలుకర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు పోలీసులు అధికారులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 88 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) ఫారెస్టు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిరూ. 30 లక్షలు తీసుకొని , నా భర్త అమర్ నాథ్ ను ఇద్దరు వ్యక్తులు తీసుకెళ్ళారని , వాళ్ళు వెళ్ళి ఇప్పటివరకు 15 రోజులైందని , నా భర్త తిరిగి రాలేదని ఆ చూకి తెల్పి న్యాయం చేయాలని ఎమ్మిగనూరుకు చెందిన లాస్య ఫిర్యాదు చేశారు. 2) నా పొలానికి శ్రీనివాసులు, పిలుజుట్టు రంగన్న, పిలుజుట్టు రామానాయుడు లు రస్తా ఇవ్వడం లేదని న్యాయం చేయాలని తుగ్గలి మండలం, ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన బైలుప్పల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. 3) నా కోడలు వసంత ఆస్తి కోసం కేసులు పెట్టి వేధిస్తున్నదని న్యాయం చేయాలని కర్నూలు, బుధవార పేటకు చెందిన సుంకలమ్మ ఫిర్యాదు చేశారు. 4) నా తమ్ముడు నాగన్న గౌడు నా ఇంటిని ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని నందవరం మండలం, కనకవీడు గ్రామానికి చెందిన నరసన్న గౌడ్ ఫిర్యాదు చేశారు. 5) నా మూడవ కుమార్తె శారద భర్త చనిపోయాడు. అప్పటి నుండి గత 18 సంవత్సరాలుగా మా దగ్గరే ఉంది. ఇద్దరు కుమారులున్నారు. మమ్మల్నే దుర్భాషలాడుతూ ఇల్లు నాదే అంటూ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తుందని , ఇల్లు ఖాళీ చేయించి న్యాయం చేయాలని ఎమ్మిగనూరుకు చెందిన గోవిందమ్మ ఫిర్యాదు చేశారు. 6) నా భర్త చనిపోయాడు. నా భర్త రూ. 1 లక్ష 50 వేలు అప్పు తీసుకున్నందుకు దౌర్జన్యంగా ఇంటి పట్టా తీసుకుని నా మరిది వెంకటేశ్వర్లు నా ఇంటిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడని కర్నూలు , ధర్మపేటకు చెందిన జి. భాగ్యమ్మ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా పోలీసులు అధికారులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐలు శివశంకర్ , చిరంజీవి పాల్గొన్నారు.

## కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ - అర్బన్ ఆశా ఉద్యోగాల భర్తీ నిమిత్తం

కర్నూలుకర్నూల్ జిల్లాలో ని గ్రామీణ ప్రాంతం లో 32, పట్టణ ప్రాంతం లో 12 ఖాళీలు , మొత్తం 44 ఆశా కార్యకర్త ఖాళీలు వున్నవి అని జిల్లా వైద్య మరియు ఆరోగ్యాశాఖాధికారి డాక్టర్ పి. శాంతి కళ తెలియజేయడం జరిగింధి. ఆశ కార్యకర్తల నియామకము కొరకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సింధిగా తెలియజేశారు. అభ్యర్థులకు ఉండవలసిన విద్యార్హతలు , జీతము మొదలగు వివరాలు దరఖాస్తు నమూనాలు వెబ్ సైట్ నందు పొందుపరచడమైనది. నిర్ణిత దరఖాస్తు నమూనాను డౌన్లోడ్ చేసుకొని పూరించిన తమ దరఖాస్తుతో పాటు , అవసరమైన సర్టిఫికెట్స్ జీరాక్స్ కాపీలు మరియు తమ విద్యార్హతలకు సంబంధించిన మార్కుల జాబితాల జీరాక్స్ కాపీలతో 24-06-2025వ తేదీ ఉదయం 10:00 గంటలకు నుంచి 28-06-2025 సాయంత్రం 05:00 వరకు అర్బన్ ప్రాంతం వారు వార్డ్ సెక్రటేరియట్ పరిధిలోని యూపీహెచ్ మెడికల్ ఆఫీసర్ అలాగే గ్రామీణ ప్రాంతం వారు ఆ గ్రామం పరిధిలోని పీహెచ్ మెడికల్ ఆఫీసర్ స్వయంగా అందజేయవలెను. నిర్ణీత గడువు ముగింపు తర్వాత అభ్యర్థులు దరఖాస్తులు స్వీకరించబడవు. పట్టణం అభ్యర్థులు వారు ఖాళీల జాబితా నందు సూచించిన స్థానిక వార్డ్ సెక్రటేరియట్ లలో, అలాగే గ్రామం అభ్యర్థులు ఖాళీల జాబితా నందు సూచించిన గ్రామం లో నివాసం ఉండి ఆ వార్డ్ , గ్రామం యొక్క కోడలు అయి ఉండే అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనుటకు అర్హులు. వేరే వార్డ్ సెక్రటేరియట్ , వేరే గ్రామం కు చెందిన అభ్యర్థులు పరిగణలోకి తీసుకొనబడవు.అటువంటి వారు అనర్హులు.



## 'కర్నూల్ జిల్లా యువత పోరు' విజయవంతం

### వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు వై. శివారెడ్డి ఆధ్వర్యంలో..






కర్నూలునిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈరోజు కర్నూలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయడం జరిగింది వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గురించే ఆలోచిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలు మోసానికి గురవుతున్నారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను కూడా తొలగిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈరోజు కర్నూలు కలెక్టరేట్ ఎదుట యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టాము ఈ కార్యక్రమంలో యువతను భాగస్వామ్యం చేసుకుని విజయవంతం చేసాము. ఈ కార్యక్రమం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్ట ప్రతుల్ మరియు యువజన విభాగం రాష్ట్ర కార్యాదర్శులు బుసిన చంద్రశేఖర్ గారు,ధరణి , నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు దుర్గ ప్రసాద్ (పాణ్యం )బాలు (కర్నూల్ )నజీర్ (యెమ్మిగనూరు )వెంకటేష్ (కోడుమూరు )అశోక్ రెడ్డి (పత్తికొండ )అశోక్ నాయుడు (ఆలూరు )రాజశేఖర్ రెడ్డి (మంత్రాలయం ) పాల్గొన్నారు

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

శ్రీశైలంలోకకల్యాణం కోసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారి సేవగా) నిర్వహించబడుతున్నాయి. కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది.ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురా రోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్ర మాదాలు, వాహన ప్రమా దాలు మొదలైనవి జరగకుండా ఉండాల ని, జనులంద రూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చక స్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి.సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190